



బీలలో విద్యుత్ వైర్లకు పిచ్చుక గూళ్లు..

పిచ్చుకా.. ఎక్కడున్నావ్?

ఒకప్పుడు సూర్యోదయ సమయాన ఇళ్ల ముందు కిచకిచమంటూ వాటి కిలకిలా రావాలు. సాయం సంధ్య వేళను గుర్తు చేస్తూ గుంపులుగా ఆకాశంలో వాటి విహారం. ఇంటికి వచ్చే అతిథిని గౌరవించినట్టు ఇళ్ల ముందర.. తోటలు.. పొలాల్లో వాటి కోసం వేలాడే వరి కంకులు.. ఇదీ పిచ్చుకలతో మనిషి అనుబంధం. కాలంతో పాటు మన జీవనశైలిలో చోటుచేసుకున్న మార్పులు.. పెరిగిన సాంకేతికత వాటి మనుగడకు ముప్పు కలిగిస్తోంది. దీంతో ఇవి ఎక్కడ కనిపిస్తాయా అని వెతుక్కోవడం మనవంతవుతోంది. ఈ నేపథ్యంలో పర్యావరణానికి.. రైతులకు ఎంతో మేలు చేసే పిచ్చుకలను కాపాడుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

- అంతరించిపోతున్న జాతుల్లో బుల్లిపిట్ట
- ఒకప్పుడు ఎక్కడ చూసినా ఇవే
- గ్రామాల్లో కనిపించని రైతు నేస్తాలు

హరిపురం/ పలాస/ హిరమండలం/ మార్చి 19(ఆంధ్రజ్యోతి)

పల్లెల పేరు చెబితే పచ్చని పైరులే కాదు.. కిచకిచమంటూ మన చుట్టూ తిరుగుతూ సందడి చేసే ఓ బుజ్జి పిట్ట కూడా గుర్తుకు వస్తుంది. ఒకప్పుడు మన జీవనంలో భాగమై... ప్రస్తుతం అంతరించిపోయే జాతుల్లో చేరి... మనుగడ కోసం పోరాడుతున్న ఆ బుజ్జి పిట్ట పేరు పిచ్చుక. పిచ్చుకలు చిన్నగా.. బొద్దుగా.. ఊదారంగులో.. పింఛం లాంటి తోకతో.. ఒకనాడు పంటచేలల్లో.. పల్లెముంగిళ్లలో...ధాన్యపు రాశుల మధ్య సందడి చేసేవి. ఇళ్ల ముంగిట గింజలు తింటూ.. గుంపులుగా ఉండే పిచ్చుకలు ఏదో అలికిడి అయితే చాలు తుర్రుమని ఎగిరే దృశ్యాలు చూడముచ్చటగా ఉండేవి. ఇప్పుడు పచ్చని చెట్ల స్థానాన్ని కాంక్రీట్ వనాలు ఆక్రమించాయి. ఇవి పక్షుల మనుగడను ప్రమాదంలో పడేస్తున్నాయి. ఆహారంతో పాటు ఆవాసాలు కరువై

(మిగతా 7వ పేజీలో..)



బీలలో పిచ్చుక గూళ్లు

సోంపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఎక్కడ చూసినా పిచ్చుక గూళ్లు కనిపించేవి. ఇప్పుడు మచ్చుకైనా లేవు. కానీ సోంపేట మండలం బీల ప్రాంతంలో మాత్రం అక్కడక్కడా ఈ గూళ్లు కనిపిస్తున్నాయి.

ఐదేళ్లుగా.. నీరు పెడుతూ..



పెట్టెలో నీరు పోస్తున్న వాసుదేవు

హరిపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మందస మండలం హరిపురం గ్రామానికి చెందిన పుల్లా వాసుదేవు మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. తన దుకాణం ఎదురుగా చెట్టును నాటి... దాని మొదలులోనే ఒక పెట్టెను ఏర్పాటు చేసి రోజూ నీరు పెడుతున్నాడు. పదేళ్ల కిందట ప్రారంభించిన ఈ చిరు ప్రయత్నం.. నేటికీ కొనసాగుతునే ఉంది. సంక్రాంతి వచ్చిందంటే చాలు.. నీరు పోసి చిన్న పక్షులు, పిచ్చుకలను ఆదుకుంటున్నాడు. ఈ నీటిని పక్షులు తాగుతుంటే ఆనందంగా ఉంటుందని చెబుతున్నారు. రాత్రి సమయాల్లో సైతం పక్షులు ఈ చెట్టు మీద నివాసం ఏర్పాటు చేసుకుంటున్నాయి.

గేట్‌లో మెరిశారు



పైడి పూజిత | కొన్న వినోద్‌కుమార్ | అనంతపట్నాయకుని మాన్య | సాయి తనూజ

ఎచ్చెర్ల/ శ్రీకాకుళం క్రైమ్/ సోంపేట/ ఆమదాలవలస, మార్చి 19(ఆంధ్రజ్యోతి)

గేట్‌లో జిల్లా విద్యార్థులు మెరిశారు. బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో మెరుగైన ర్యాంకులు సాధించారు.

● జిల్లాకు చెందిన కొన్న వినోద్‌కుమార్ జాతీయ స్థాయి 28వ ర్యాంకు సాధించారు. సంతబొమ్మాళికి చెందిన ఈయన 2012-15 విద్యా సంవత్సరంలో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈ విభాగంలో డిప్లొమో, టెక్కలిలో బీటెక్ పూర్తిచేశారు. అనంతరం హెచ్‌సీఎల్, ఎస్ఎస్‌జేఈలో రెండు ప్రభుత్వ కొలువులు సాధించి అధ్యాపక వృత్తిపై ఆసక్తితో వాటిని విడిచిపెట్టారు. ప్రస్తుతం విశాఖపట్నం జిల్లా భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈ విభాగం అధ్యాపకుడిగా పనిచేస్తూ, టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఈయన 100కు 71మార్కులు సాధించారు.

● ఆమదాలవలస మండలం వంజంగి గ్రామానికి చెందిన పైడి పూజిత 25వ ర్యాంకు సాధించారు. నాగపూర్‌లోని వీఎన్ఐటీలో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నారు. పూజిత తండ్రి ఎల్ఎన్‌పేట ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. తల్లి ఆదిలక్ష్మి గృహిణి.

● శ్రీకాకుళానికి చెందిన అనంతపట్నాయకుని మాన్య 197వ ఆలిండియా ర్యాంకు సాధించారు. మాన్య తండ్రి ఏపీ శ్రీనివాసరావు జిల్లా పోలీసు కార్యాలయం క్లూస్ టీమ్‌లో పనిచేస్తున్నారు. మాన్య ఐఐటీ ధన్‌బాద్‌లో బీటెక్ చదివారు. జాతీయ స్థాయిలో మంచి ర్యాంకు సాధించడం పట్ల కుటుంబ సభ్యులతోపాటు తోటి విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

● సోంపేట విద్యార్థి బల్ల సాయి తనూజ జాతీయ స్థాయిలో 396వ ర్యాంకు సాధించారు. తనూజ సోంపేటలో ఉన్నతవిద్య అభ్యసించగా, ఇంటర్ విశాఖపట్నంలో, బీటెక్ నాగార్జున యూనివర్సిటీలో పూర్తి చేశారు. తరువాత హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుని గేట్‌లో మంచి ర్యాంకు సాధించారు. ఈమెకు 100కి 55 మార్కులు వచ్చాయి.

సుడా ఇళ్ల స్థలాల కేటాయింపు

మళ్లీ మొదటికి!

- ఆందోళన వ్యక్తం చేసిన లబ్ధిదారులు

పలాస, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సుడా అప్రూవల్ లేఅవుట్‌లో ఫ్లాట్ల కేటాయింపు వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. బుధవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో సుడా సిబ్బంది గతంలో రద్దు చేసిన గృహాలకు మళ్లీ డ్రా తీసేందుకు దరఖాస్తుదారులతో సమావేశం అయ్యారు. అయితే అధికారుల నిబంధనలపై లబ్ధిదారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఫ్లాట్ల కేటాయింపుపై గందరగోళం నెలకొంది. గతంలో కూడా సుడా లేఅవుట్ ప్రాంతంలో ఎమ్మెల్యే, జాయంట్ కలెక్టర్ సమక్షంలో అట్టహాసంగా ఈ కార్యక్రమం నిర్వహించి ఫ్లాట్లు కేటాయించలేదు. మళ్లీ అదే పరిస్థితి నెలకొనడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. 240 చదరపు గజాల స్థలాల వ్యవహారంలో 10 శాతం ప్రభుత్వ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగుల కోటా పూర్తి చేసిన తరువాత జనరల్ కేటగిరీకి ఇస్తామని అధికారులు ప్రకటించారు. ఒకటో లేఅవుట్‌లో ఫ్లాట్లు రాని అభ్యర్థులకు తర్వాత ఇస్తామని, గతంలో వేసిన లాటరీ పూర్తిగా రద్దు చేసామని, మళ్లీ కొత్తగా వేస్తామని ప్రకటించడంతో లబ్ధిదారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తాము ఎంచుకున్న విధంగా 240 చదరపు గజాల స్థలాలు కేటాయించాలని, లేకుంటే కోర్టుకు వెళతామని హెచ్చరించారు.



వసపను వీడని ఏనుగులు

8లో

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

8లో



హైవేపై ద్విచక్ర వాహనం దగ్ధం

8లో

రియల్ దగా!



అనుమతులు లేకుండా వేసిన వెంచర్

- అనుమతుల్లేకుండా వెలుస్తున్న వెంచర్లు
- మోసపోతున్న కొనుగోలుదారులు
- చోద్యం చూస్తున్న యంత్రాంగం

సోంపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నిబంధనలు తుంగలో తొక్కి. మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం యథేచ్ఛగా సాగిపోతుంది. కనీస నిబంధనలు కూడా పట్టించుకోవడం లేదు. వ్యవసాయ భూములు కొనుగోలు చేసి ఏంచక్కా వెంచర్లగా మార్చేసి దోచుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి అన్నిరకాల అనుమతులు తీసుకోవాల్సి ఉన్నా.. సోంపేటలో మాత్రం అమలు కావడం లేదు. వెంచర్లను డివిజనల్ అధికారి, తహసీల్దార్ కలసి పరిశీలన చేసి సదరు భూ హక్కులు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధాణ చేసి అందుకు అనుమతులు ఇవ్వాలి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూముల్లోకి మార్పులు చేసుకోవాలి. దీనికోసం స్థల బదలాయింపు చార్జీలను చలానా రూపంలో వసూలు చేయాల్సి ఉంటుంది. అనంతరం వివిధ శాఖల అధికారుల అనుమతులు వచ్చాక స్థలంపై రహదారులు నిర్మించాల్సి ఉంటుంది. అయితే పట్టణానికి సమీపాన కవిటి వెళ్లే రోడుకు ఆనుకొని ఉన్న సుమారు నాలుగు ఎకరాల స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండానే లే ఔట్ వేసినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా గతంలో జిరాయితీ భూమి అయినప్పటికీ ప్రసుత్తం ఈ స్థలం నిషేధిత భూముల (22ఏ) జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదేమీ కొనుగోలుదారులకు చెప్పకుండా మసిపూసి మారేడుకాయ చేస్తూ విక్రయాలు చేసుకుంటున్నారు. భవిష్యత్తులో కొనుగోలుదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

చర్యలకు ఆదేశించాం

కవిటి రోడ్డులోని వెంచర్‌కు సంబంధించి భూ బదాలయింపు కోసం దరఖాస్తు వచ్చింది. పరిశీలించాగా అందులో కొంత భూమి నిషేధిత జాబితాలో ఉంది. ఈ విషయాన్ని భూ యజమానులకు తెలిపాం. అయినా అనుమతులు లేకుండా భూమిని అభివృద్ధి చేసిన విషయం తన దృష్టికి వచ్చింది. ఈ విషయమై చర్యలకు ఈవోని ఆదేశించాం.

- బి.అప్పలస్వామి, తహసీల్దార్

లే ఔట్‌ను తొలగిస్తాం

కవిటి రోడ్డులో ఎటువంటి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వెంచర్ వేస్తున్నట్టు తన దృష్టికి వచ్చింది. రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించి తొలగిస్తాం.

- ఎం.శాంతికుమారి, ఈవో, సోంపేట

పశువైద్య కుంభకోణంపై దర్యాప్తు చేయాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే కూన రవికుమార్



మాట్లాడుతున్న రవికుమార్

ఆమదాలవలస, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన పశువైద్య కుంభకోణంపై సంబంధిత శాఖ దర్యాప్తు చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. బుధవారం ఆయన అసెంబ్లీలో ఈ విషయంపై మాట్లాడారు. గత ప్రభుత్వం 340 పశువైద్య మొబైల్ వాహనాలు కొనుగోలు చేసినట్టు గణాంకాలు తెలుపుతున్నాయని, వీటి ద్వారా రాష్ట్రంలో ఎక్కడా ఎటువంటి ఉపయోగం లేకపోయినా భారీ స్థాయిలో నిధులు దుర్వినియోగం జరిగాయన్నారు. ఒక్కో వాహనానికి అధిక మొత్తంలో రూ.36 లక్షలు కేటాయింపుల్లో వారి అవినీతి బట్టబయలు అయిందన్నారు. రాష్ట్రంలో ఏ పశువైద్య కేంద్రం కూడా 24 గంటలు వైద్యసేవలు అందించే దాఖలాలు లేనప్పటికీ లిఫ్ట్ సదుపాయంతో కూడిన వాహనాలు తీసుకురావడం హాస్యాస్పదమన్నారు. ఆ వాహనాలను తాను స్వయంగా పరిశీలించడం జరిగిందని, వాటిలో ఎటువంటి అవసరమైన మందులు లేకుండా తాత్కాలిక సామగ్రితో ఉన్నాయన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించే 108 వాహనం ఖరీదు రూ.18 లక్షలు. అయితే రాష్ట్రంలో 80 శాతం పనిచేయని ఈ పశువైద్య వాహనాలు ఖరీదు రూ.36 లక్షలుగా గత పాలకులు ఖర్చు చేయడంపై తక్షణమే విచారణ చేపట్టాలని ఆయన కోరారు.

రాత్రికి రాత్రే నిర్మాణాలు

- నిబంధనలకు తిలోదకాలు

ఆమదాలవలస, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పురపాలక సంఘ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రికి రాత్రే ఇష్టారాజ్యంగా నిర్మాణాలు జరుపుతున్నారు. వీఎల్‌టీ, నాలా కట్టకుండా వ్యవసాయ భూములను కమర్షియల్ స్థలాలుగా మార్చేస్తున్నా మున్సిపల్ అధికారులు చోద్యం చూడడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనను విమర్శించే ప్రస్తుత అధికార పార్టీ నాయకులు ఈ అక్రమ నిర్మాణాలపై స్పందించకపోవడంపై సర్వాత్రా చర్చించుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. పురపాలక సంఘం ఒకటో వార్డు పార్వతీశంపేట పరిధిలో ఉన్న 22 సెంట్లు స్థలంలో ఒక వ్యక్తి ఔట్ లెట్ టైల్స్ వ్యాపారం పేరుతో గతంలో ఒక నిర్మాణాన్ని చేపట్టారు. ప్రస్తుతం దాని వెనుక భాగంలో సుమారు ఎనిమిది సెంట్లు విస్తీర్ణంలో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా పక్కాగా నిర్మాణాలు ప్రారంభించారు. స్థానికులు సమాచారం మేరకు మున్సిపల్ అధికారులు సదరు వ్యక్తికి నోటీసు జారీ చేశారు. అయితే అధికార పార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్న ఆ వ్యక్తి ఆ నోటీసులకు పట్టించుకోలేదు. సామాన్యులపై కొరడా ఝుళిపించే మున్సిపల్ అధికారులకు ఈ వ్యవహారం పట్టకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

పార్వతీశంపేట సర్వే నెంబరు 53లో నిర్మాణం చేపడుతున్న వ్యక్తికి ఇప్పటికే ఒకసారి నోటీసు జారీ చేశాం. రెండోసారి నోటీసు ఇవ్వడానికి సిద్ధం చేశాం. ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్ సెలవులో ఉండడం వల్ల ఇవ్వలేకపోయామన్నారు.

- చింతాడ నవీన్‌కుమార్, ఇన్‌చార్జి టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్

పదోతరగతి పరీక్షకు 143 మంది గైర్హాజరు

గుజరాతీపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షకు 143 మంది గైర్హాజరయ్యారు. సెకెండ్ లాగ్వేంజ్ హిందీ పరీక్షకు రెగ్యూలర్ విద్యార్థులు 28,020 మందికిగాను 27,891 మంది హాజరై 129 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ప్రైవేట్ స్టడీకి సంబంధించి 38 మందికిగాను 24 మంది హాజరు కాగా, 14 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా డీఈవో ఎస్.తిరుమల చైతన్య జిల్లాలోని పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు, కాశీబుగ్గ-పలాస జడ్పీ ఉన్నత పాఠశాల, అంబుగాం పాఠశాలలకు సందర్శించి ఆయా పాఠశాలలో ఏర్పాట్లు చూపి సంతృప్తి చెందారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం ఎటువంటి ఆటంకం లేకుండా పరీక్షలు జరిగినట్టు డీఈవో పేర్కొన్నారు.

- జిల్లా విద్యాశాఖలో టీఎంఎఫ్‌లో భాగంగా నైట్ వాచ్‌మన్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి జనవరి, ఫిబ్రవరి నెలల గౌరవ వేతనం విడుదల చేసినట్టు డీఈవో తెలిపారు. ఆయా అన్ని యాజమాన్య పాఠశాలల హెచ్‌ఎంలు వీటిని గమనించాలని కోరారు.

తమ్మినేని పరామర్శ

ఆమదాలవలస, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నిమ్మతొర్లాడ గ్రామ సర్పంచ్ సోమరాజు తేజ అనారోగ్యం బారినపడ్డారు. ఈ మేరకు బుధవారం మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పరామర్శించారు. ఈయనతోపాటు వైసీపీ నాయకులు కోట గోవిందరావు, గురుగుబిల్లి శ్రీనివాసరావు, అప్పలనాయుడు, సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ జనార్దన్

గార, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.జనార్దనరావు అన్నారు. బుధవారం బల రాంపురంలో నిర్వహించిన సంకల్పంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

శ్రీకాకుళం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్‌పై పలు కార్పొరేషన్‌లకు టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులను డైరెక్టర్లగా నియమిస్తూ బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా.. యాదవ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్‌కు 15 మంది నాన్ అఫిషియల్ డైరెక్టర్లను నియమించింది. వీరిలో ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన దాసరి రాజు, టెక్కలి నియోజకవర్గానికి చెందిన ఇప్పిలి జగదీశ్వరరావు యాదవ్ ఉన్నారు. గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్‌కు సంబంధించి 15 మంది నాన్ అఫిషియల్ డైరెక్టర్లను నియమించాగా, వీరిలో పాతపట్నం నియోజకవర్గానికి చెందిన భాస్కర్ గౌడ్ నియమితుల య్యారు.

22 నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

ఆమదాలవలస, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ నెల 20 నుంచి 22వ వరకు శిక్షణ ఇవ్వనున్నట్టు పీవో అనురాధ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐసీడీఎస్ సర్వీసెస్, న్యూట్రిషన్, నవచేతన వంటి విధానాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

గాలికుంటు వ్యాధితో పాల దిగుబడి తగ్గుదల

పాతపట్నం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): గాలికుంటువ్యాధి సోకిన పశువులు తక్కువ పాలు ఇస్తాయని, అందువల్ల వ్యాధి సోకకుండా చూసుకోవాలని పశుసంవర్థకశాఖ టెక్కలి డివిజన్ ఏడీ జయరాజ్ అన్నారు. బి.గోపాలపురంలో బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. పెద్దలోగిడి పశువైద్యాధికారి మౌనిక తదితరులు ఉన్నారు.

'సూర్యఘర్'పై అవగాహన పెంచండి

ఇచ్ఛాపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకం ప్రజలకు అవగాహన కల్పించాలని ఏపీఎం ఎస్.ప్రసాద్ అన్నారు. బుధవారం మండపల్లి గ్రామ సంఘం నెలవారి సమావేశం నిర్వహించి స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సంఘ సభ్యులచే ప్రతిజ్ఞ చేయించారు. హోమ్ కంపోస్ట్, కిచెన్ గార్డెన్, ఇంకుడు గుంతలు, ప్లాస్టిక్‌పై, పీఎం సూర్యఘర్ పథకాలపై అవగాహన కల్పించారు.

కబడ్డీ ఆడిన ఎమ్మెల్యే గొండు



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ ప్రజాప్రతినిధులకు క్రీడా పోటీలు జరుగుతున్న విషయం తెలిసిందే. రెండో రోజు కూడా ఉత్సాహంగా పోటీలు జరిగాయి. ఇందులో కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని.. ఉత్సాహంగా ఆడారు. ఈ సందర్భంగా ఇతర ప్రజాప్రతినిధులు అభినందించారు.

వెనుకబడిన కుటుంబాలకు చేయూత

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు పబ్లిక్, ప్రవేట్, పీపుల్ పార్టీనర్ షిప్ (పీ-4) అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం పీ-4 కార్యక్రమంపై జరిగిన అభిప్రాయ సేకరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రవాసాంధ్రుల సంపన్న కుటుంబాలను భాగస్వాములను చేసి, వారి సహకారంతో వెనుకబడిన కుటుంబాలను ఆదుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సీపీవో ప్రసన్నలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, పలు పరిశ్రమల ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ



వైద్యవిద్యార్థులను అభినందిస్తున్న జెమ్స్ యాజమాన్యం

శ్రీకాకుళం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ 26వ ఇంటర్ కొల్లిగేట్ క్రీడల పోటీలు ఇటీవల డా. పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం రాగోలు జెమ్స్ వైద్యకళాశాలకు చెందిన వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు. టేబుల్ టెన్నిస్‌లో జెమ్స్ వైద్యవిద్యార్థులు ప్రథమస్థానం సాధించి.. బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం జెమ్స్ కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, మెడికల్ సూపరింటెంట్, ఫిజికల్ డైరక్టర్లు తదితరులు విద్యార్థులను అభినందించారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి



యాప్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మా ణంలో అందరూ భాగ స్వామ్యం కావాలని డాక్టర్ బీఆర్ అంబే ఢ్కర్ యూనివర్సిటీ వీసీ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో బుధవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల మానవతా విలువలు దిగజారిపోతున్నాయన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ లక్ష్యానికి చేరువకావాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్, వర్సిటీ ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు. డ్రగ్స్ నివారణపై అవగాహన చైతన్యపరిచేలా వర్సిటీ విద్యార్థులు రూపొందించిన యాప్‌ను ఆవిష్కరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆమదాలవలస, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలోని 15వ వార్డు పరిధిలోని కొత్తకోట వారి వీధిలో సీసీ డ్రైన్, కల్వర్టు పనులకు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ జాన్సన్ టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే శ్రీనివాసచార్యులపేట పంచాయతీ ఈసర్లపేట గ్రామానికి బీటీ రహదారి నిర్మాణానికి పొందూరు మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కూన సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

జి.సిగడాం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధి పథకం మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో , ఎన్‌ఆర్‌ఈజీఎస్ పోగ్రాం అధికారి జి. రామకృష్ణ తెలిపారు. 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు మండలంలోని 31 పంచాయతీల్లో ఉపాధి నిదులుతో, వివిధ విభాగాల సమన్వయంతో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో జరిపిన పనులపై 16వ విడత సామాజిక తనిఖీలపై నిర్వహించనున్న ప్రజావేదికకు ప్రజాప్రతినిధులు, అధికారులు విదిగా హాజరు కావాలని ఆయన కోరారు.

శ్రీకూర్మం ఆలయ ఈవోగా నరసింహనాయుడు

గార, మార్చి 19(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలో ప్రసిద్ధ కూర్మనాథ్ ఆలయ ఈవోగా కె.నరసింహనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వి.వినయ్ చంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడలో పురావస్తుశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ఏడాదిపాటు డిప్యూటేషన్‌పై ఈవోగా నియమించారు. ఇంతవరకు ఇక్కడ ఈవోగా విధులు నిర్వహిస్తున్న జి.గురునాథరావు ఇన్‌చార్జి ఈవోగా సేవలందించనున్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్ఛాపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ పి.శిరీష బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతి, ఇంటర్ (సీఈసీ) గ్రూపులో ప్రవేశాలతోపాటు 7, 8, 9, 10వ తరగతులు, ఇంటర్‌లో మిగిలిన సీట్లు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఈ నెల 22నుంచి వచ్చే నెల 11వతేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

31లోగా పన్ను బకాయిలు చెల్లించాలి

ఇచ్ఛాపురం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, నీటి పన్నులు తదితర బకాయిలు ఈ నెల 31వ తేదీలోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాల్టీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

చిన్నశ్రీను తనయుడి మృతి బాధాకరం

ఆమదాలవలస, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రెండో కుమారుడు ప్రణీత్ మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి బుధవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. నాలుగేళ్ల కిందట రోడ్డు ప్రమాదానికి గురైన ప్రణీత్ మృత్యువుతో పోరాడి ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు.

పిచ్చుకా.. ఎక్కడున్నావ్?

(ఐదో పేజీ తరువాయి)

ఇప్పటికే ఎన్నో పక్షి జాతులు అంతరించిపోయాయి. ఇంటి పక్షిగా పేరొందిన పిచ్చుకలదీ ప్రస్తుతం అదే పరిస్థితి. మన సాంకేతిక పరిజ్ఞానం నుంచి వస్తున్న రేడియేషన్... మనం సృష్టిస్తున్న కాలుష్యంతో పోరాడే శక్తి లేని ఈ చిట్టి పక్షులు చల్లని ప్రదేశాలకు వలస వెళ్లడమే కాకుండా.. ప్రాణాలూ పోగొట్టుకుంటున్నాయి. ఉండేందుకు కాస్త చోటు, తినేందుకు ఆహారం.. తాగేందుకు నీరు అందుబాటులో ఉంచితే ఈ జాతిని కొన్నాళ్లయినా కాపాడుకోవచ్చు. పిచ్చుకలు అన్యోన్యతకు.. ఆదర్శానికి మారుపేరుగా నిలవటంతోపాటు రైతుల నేస్తాలుగా.. మనిషితో మమేకమవటంతో దీన్ని గుర్తించిన ప్రపంచ దేశాలు ఏటా మార్చి 20న 'ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని' నిర్వహిస్తున్నాయి. వీటి ప్రాధాన్యాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం తపాలా బిళ్లను విడుదల చేసింది.

మానవ జీవన శైలిలో వచ్చిన సమూల మార్పే పిచ్చుకపై బ్రహ్మాస్త్రంగా పరిణమించింది. శరవేగంగా జరుగుతున్న పట్టణీకరణ, అంతరిస్తున్న పచ్చదనం, పూరిళ్లు, రసాయనాలతో కలగలిసిన పండ్లు, ఆహార ధాన్యాలపై పురుగు మందుల పిచికారీ వంటివి వీటికి ముప్పు కలిగిస్తున్నాయి. ఇక సెల్ టవర్ల నుంచి వెలువడుతున్న రేడియేషన్. అయస్కాంత తరంగాలు వాటి ఉనికికే ముప్పుగా మారాయి. పూరిళ్లలో పిచ్చుకలకు ఆహారంగా వేలాడదీసే వరికంకులు లేక, పంటలు పండక.. నివాస స్థలాలే కరువవుతున్నాయి. దీంతో ఇవి ప్రస్తుతం గ్రామాల్లో సైతం సరిగా కనిపించడం లేదు. పట్టణ ప్రాంతాల్లో వాహనాల కాలుష్యం, చెట్లు లేకపోవడం, అపార్ట్‌మెంట్లు వెలుస్తుండటంతో పిచ్చుకల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

గూడంటే గూడూ కాదు..

గిజిగాడు(పిచ్చుక) గూడు ప్రత్యేకమైనది. ఇవి ఇంజనీరింగ్ ప్రతిభతో ఈత, తుమ్మ, తాటి, కొబ్బరి చెట్ల కొమ్మల చివరన ఒకటే పొడవు ఉన్న గడ్డి పోచలను తెచ్చుకుని అత్యంత నైపుణ్యంతో గూడు కట్టుకుంటాయి. గూడు బాగుంటేనే ఆడపక్షి... మగపక్షితో జత కడుతుందంటారు. పిచ్చుక గూటికి మార్గం కింది నుంచి ఉంటుంది. ఈ గూడు లోపల వెచ్చగా ఉండడంతో పాటు వానవచ్చినా తడవకపోవడం ప్రత్యేకత. బోర్లు, కుళాయిలు వచ్చాక ఊళ్లలో బావులను పూడ్చేయడం.. సాగు పేరుతో ఒక్క అంగుళాన్నీ వదలకుండా.. కొందరు ఇవి గూడు కట్టుకొనే చెట్లను నరికి వీటికి నష్టం కలిగిస్తున్నారు. దీంతో ఇవి గూడు కట్టుకోవడానికీ చోటు దొరకడం లేదు.

ప్రభుత్వం గుర్తించింది..



పిచ్చుకలను అంతరించిన జాబితాలో ఇప్పటికే కలిపారు. వీటిని సంరక్షించేందుకు ప్రభుత్వం జూలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జూలలో వీటి నివాసానికి ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేసి జాతి పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి. పలాసలో అటవీశాఖ నిర్వహించే పార్కులో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తే జాతిని ఆదుకోవచ్చు.

- మురళీకృష్ణంనాయుడు, ఫారెస్ట్ రేంజర్, కాశీబుగ్గ

నీరు అందిస్తే చాలు..



మానవ జీవన మనుగడకు జీవవైవిధ్యం ప్రధానం. మనతోపాటు అన్నిరకాల పక్షులు ఉంటేనే సమతుల్యత ఏర్పడుతుంది. పిచ్చుకల కోసం తాగు నీరు, వరికంకులు ఇళ్ల ముందర చెట్లకు వేలాడదీసి... వాటికి రక్షణ కల్పించవచ్చు. ఏడాది పొడవునా మా పరిసరాల్లో ఈ ఏర్పాట్లు చేస్తున్నాం. వీటిని విరివిగా పెంచుతున్నాం. పెంపుడు కోళ్ల కంటే ఇవి ఎక్కువ మచ్చికగా ఉంటాయి.

- ఎస్.భీమారావు, పక్షి ప్రేమికుడు, సువర్ణాపురం

క్రైం కార్నర్

భార్య హత్య కేసులో భర్త అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న జేఆర్ పురం సీఐ ఎం.అవతారం

ఎచ్చెర్ల, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సంతసీతారాంపురం గ్రామంలో ఈ నెల 17వ తేదీ రాత్రి భార్యను హత్య చేసిన ఘటనలో భర్తను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఎచ్చెర్ల పోలీసు స్టేషన్‌లో జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం విలేకరులకు వెల్లడించారు. గాలి అప్పలరెడ్డి, నాగమ్మలకు 22 ఏళ్ల కిందట వివాహమైందని, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యా భర్తలు ఇద్దరూ ఎప్పుడులాగే సోమవారం రణస్థలం మండలం కొవ్వాడ గ్రామంలో సరుగుడు, నీలగిరి తోటలు నరికే పని పూర్తిచేసుకుని రాత్రి 7.30 గంటలకు ఇంటికి చేరుకున్నారు. మద్యం తాగే అలవాటు ఉన్న అప్పలరెడ్డి ఆ రోజు కూడా అదే మత్తులో భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆయన విచక్షణ కోల్పోయి ఇంట్లో ఉన్న కత్తితో భార్యపై దాడిచేసి హతమార్చాడు. ఆ తర్వాత తానే హత్య చేసినట్టు వీఆర్వో ఎదుట లొంగిపోయాడు. కుమారుడు త్రినాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎస్‌ఐలు వి.సందీప్‌కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

90 ధాన్యం బస్తాలు దగ్ధం



కాలిపోయిన ధాన్యం

జి.సిగడాం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దేవరవలసలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో 90 ధాన్యం బస్తాలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతులు అప్పారావు, అప్పలదాజు, సూర్యారావు కళ్లాలు వద్ద జరిగిన ఈ ప్రమాదంలో ధాన్యం కాలిబూడిదయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ఇలా జరగడంతో రైతులు బోరున విలపి స్తున్నారు. పక్కన ఉన్న గడ్డివాములు కూడా దగ్ధామయ్యాయి. అప్పారావుకి చెందినవి 40 బస్తాలు, అప్పలదాసువి 40 బస్తాలు, సూర్యారావువి 10 బస్తాలు కాలిపోయాయి. సుమారు రూ.2 లక్షలు వరకు నష్టం ఉంటుందన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

హైవేపై ద్విచక్ర వాహనం..



పలాస, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రతకు రోడ్డుపై వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనం దగ్ధమైన ఘటన బుధవారం మధ్యాహ్నం మొగిలిపాడు ఫ్లైఓవర్ వద్ద సంభవించింది. రామకృష్ణాపురం గ్రామానికి చెందిన తిమ్మల విశ్వనాథం పలాస నుంచి స్వగ్రామం తిరిగి వెళ్తుండగా ఇంజన్ వద్ద పొగలు రావడాన్ని గుర్తించాడు. వెంటనే వాహనం ఆపేందుకు ప్రయత్నించగా అప్పటికే మంటలు వ్యాపించడంతో వాహనాన్ని నిలిపివేసి పరుగులు పెట్టాడు. కళ్లముందే తన వాహనం దగ్ధం కావడంతో ఆవేదన వ్యక్తం చేశాడు.

న్యాయం చేయాలని ఆశా కార్యకర్త ఫిర్యాదు

టెక్కలి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తనను గ్రామ బహి ష్కరణ చేశారని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని సంతబొమ్మాళి మండలం గెద్దల పాడు ఆశా కార్యకర్త చంద్రమ్మ బుధవారం డీఎస్పీ డీఎస్ఆర్‌వీ ఎస్ఎన్ మూర్తికి ఫిర్యాదు చేశారు. స్థానికులు తనకు సహకరించడం లేద ని, తన భర్తను చేపల వేటకు వెళ్లకుండా గ్రామస్థులు అడ్డుకుంటున్నారని, ఆటో కూడా ఎవరూ ఎక్కించడం లేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు. విచారణ జరిపిస్తానని డీఎస్పీ తెలిపారు.

ఆర్డీవో విచారణ



బాధితులు, గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం గెద్దలపాడు ఆశావర్కర్ గ్రామ బహిష్కరణపై బుధవారం రాత్రి సబ్ కలెక్టర్ కార్యా లయం లో ఆర్డీవో ఎం.కృష్ణ మూర్తి గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్థులకు, ఆశా కార్యకర్తకు ఆయన పలు సూచనలు చేశారు. తప్పిదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

సారా వద్దంటూ ఊరూరా ప్రచారం

పలాస/పలాస రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సారా వద్దంటూ కాశీబుగ్గ ఎక్సైజ్ సీఐ కె. మల్లికార్జునరావు, ఎస్ఐ షేక్ సైదా ఆధ్వర్యంలో బుధవారం విస్తృతంగా ప్రచారం చేశారు. పెంటి భద్ర, మొగిలిపాడు, పురుషోత్తపురం, జగన్నాథపురం, సవర రామకృష్ణాపురం, శాసనం గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేసి మైక్‌తో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సారాతో పట్టుబడితే పీడీ కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. సారా అమ్మితే రూ.లక్ష నుంచి ఆపై జరిమానా విధిస్తామన్నారు. నవోదయం-2.0 పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. సారా తాగినా, విక్రయించినా తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పుడు కేసులు రాసే టీటీఐలపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నేతలు

టెక్కలి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తప్పుడు కేసులు రాసే టీటీఐలపై చర్యలు తీసుకోవాలని ఏపీ టీటీడీ ఎన్ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. 1/2019 సర్క్యులర్ అమలు చేయాలన్నారు. అనకాపల్లి డిపో మేనేజర్ వైఖరిపై తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో అధ్యక్ష, కార్యదర్శులు టీఆర్ మూర్తి, పీవీకే రాజా, ఎస్ఆర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడోసారి వాయిదా

- సిండికేట్‌గా కాంట్రాక్టర్లు
- ప్రభుత్వ నిర్దేశిత ధరకు తక్కువకు వేలం
- నిబంధనలకు విరుద్ధంగా ఆశీలు వసూలు
- ఇదీ మేజర్‌పంచాయతీలో దుస్థితి



బుధవారం ఆశీలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

నరసన్నపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వ్యాపారపరంగా దినదినాభివృద్ధి చెందుతూ పట్టణ పరిధి విస్తరిస్తున్నప్పటికీ పంచాయతీకి రావాల్సిన ఆశీలుమాత్రం అనుకున్న స్థాయిలో రావడం లేదు. పట్టణంలోని మార్కెట్, తోపుడుబండ్లు, వారపు సంత, చేపల మార్కెట్, బస్టాండ్ నుంచి వసూలు చేసే ఆదాయం పెరగకపోవడంతో పంచాయతీ అభివృద్ధికి అవరోధంగా తయారవుతోంది. ఇదీ మేజర్ పంచాయతీలో తీరు. ప్రతి ఏటా ఆశీలు వసూలుకు సంబంధించి పంచాయతీ అధికారులు బహిరంగ వేలంపాట నిర్వహిస్తారు. దీనికి సంబంధించి ప్రభుత్వ నిర్దేశిత ధరకు మించి పాటదారులు పాడాల్సి ఉంటుంది. అయితే నరసన్నపేట మేజర్ పంచాయతీలో పాట దారులు సిండికేట్‌గా తయారై వేలంలో పాల్గొంటుండడంతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది. దీనికి గడచిన రెండేళ్లుగా జరుగుతున్న వేలంపాటలే ఉదాహరణ. ప్రభుత్వ ధర ముందుగా లీకవడం, పాటదారులు అధికారుల ఎదుటే సిండికేట్‌గా మారుతుండడంతో పంచాయతీ ఆదాయం గణనీయంగా పడిపోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. 2023-24 సంవత్సరంలో రోజువారీ మార్కెట్ ఆశీలవేలంపాట రూ.19లక్షలకు వెళ్లగా, 2024-25లో రూ.19.60 లక్షలకు మాత్రమే వెళ్లింది. ప్రతి ఏటా పది నుంచి 20 శాతం పెరగాల్సి ఉండగా కేవలం రూ60 వేలు మాత్రమే పెరిగిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంటే అప్‌సెట్ ప్రైస్‌కి దగ్గరగా పాట ఖరారవడం ఇందుకు నిదర్శనం. 2025-26 సంవత్సరానికి సంబంధించి ఆశీలు వసూలుకు వేలంపాట రెండు పర్యాయాలు నిర్వహించారు. తాజాగా బుధవారం మూడోసారి వేలం నిర్వహించినప్పటికీ సర్కారు ధరకు వేలం పాడేందుకు పాటదారులు ముందుకు రాకపోవడంతో ఈనెల 22వ తేదీకి మరోసారి వాయిదా వేశారు. సిండికేట్ కావడం వల్లే సర్కారు ధరకు కూడా చేరడం లేదన్నది బహిరంగ రహస్యం.

జనాభా, దుకాణాలు పెరిగినా..

గడచిన ఐదేళ్లలో పట్టణంలో 30 వేలకు పైగా జనాభా పెరిగింది. పదుల సంఖ్యలో పెద్ద షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థలు నెలకొల్పారు. రెండు కిలోమీటర్ల మేర ఉన్న మెయిన్ రోడ్డుకు ఇరువైపులా వందల సంఖ్యలో చిరువ్యాపారాలు, చిన్న దుకాణాలు ఏర్పాటయ్యాయి. అయినా 2021-2025 మధ్యలో పంచాయతీ ఆదాయం ఏమేరకు పెరిగిందో పంచాయతీ అధికారులకే ఎరుక. అయితే వేలంపాట దక్కించుకున్న కాంట్రాక్టర్లు మాత్రం ఆశీలు వసూలును ఇష్టానుసారంగా చేస్తున్నారు. పంచాయతీ అధికారులు నిర్ణయించిన ధర వ్యాపారుల నుంచి వసూలు చేయాల్సి ఉంది. అలాగే పంచాయతీ కార్యదర్శి సంతకం, ఆఫీసు స్టాంపు ఉండాల్సి ఉంది. అయితే కాంట్రాక్టర్లు నిబంధనలకు తిలోదకాలిచ్చి ఎక్కువ మొత్తం వ్యాపారుల నుంచి ముక్కు పిండి మరీ వసూలు చేసుకుని వారి జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. హైకోర్టు మార్గదర్శకాల మేరకు రవాణా వాహనాలకు ఆశీలు వసూలు చేయకూడదు. అయితే నరసన్నపేటలో కాంట్రాక్టర్లు అటువంటి నిబంధన పాటించకపోవడంతో ఇటీవల ట్రాన్స్‌పోర్టు యాజమాన్యాలు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినా వారి తీరు మారలేదు. దీంతో కాంట్రాక్టర్లు ఆశీలు ధర కంటే ఎక్కువ సంపాదిస్తున్నా పంచాయతీకి మాత్రం ఆదాయం రావడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

ఆశీలు పాట అప్‌సెట్ ప్రైస్‌కు మించి పాడితేనే ఖరారు చేస్తాం. పంచాయతీ ఆదాయం పెంచడమే లక్ష్యం. ఈ ఏడాది ఆశీలు వసూలుపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. నిబంధనలు, ధరల ఖరారుకు ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుంది. పంచాయతీ నిర్ణయించిన ధరల మేరకే ఆశీలు వసూలు చేయాలి.

-పల్లి ద్రాక్షాయిణి, ఈవో, నరసన్నపేట

రూ.16 లక్షలకు ఆశీలు వేలం ఖరారు

పలాస, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో రోజువారీ మార్కెట్ ఆశీలు వేలం రూ.16 లక్షలకు ఖరారైంది. బుధవారం కమిషనర్ ఎన్.రామారావు, చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన వేలం పాట నిర్వహించారు. పలాసకు చెందిన జోగ కృష్ణారావు రూ.16 లక్షలకు పాటను దక్కించుకున్నారు. ఆయనకు పోటీగా పిడుగు పాపారావు రూ.15.90 లక్షల వరకు పాడారు. అదేవిధంగా జంతువధ శాలకు రాజేష్ ఖాన్ రూ.50 వేలకు దక్కించుకున్నారు. వేలంపాటలో ఎక్కువ మంది పాటదారులు పాల్గొంటారని అధికారులు భావించినప్పటికీ కేవలం నలుగురు మాత్రమే పాల్గొనడంతో అధికారులకు నిరాశ కలిగించింది.



ఆశీలు వేలం పాట నిర్వహిస్తున్న కమిషనర్, చైర్మన్

హిరమండలంలో రూ.8 లక్షలకు..

హిరమండలం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హిరమండలం మేజర్ పంచాయతీలో రోజువారి ఆశీలు వసూలుకు గాను బుధవారం పంచాయతీ కార్యాలయంలో డీఎల్పీవో ఆర్.గోపీబాల ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. 14 మంది కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. సర్కారు పాట రూ.6.61 లక్షలుగా అధికారులు ప్రకటించగా హిరమండలానికి చెందిన వారణాసి ఉదయ భాస్కరరావు రూ.8 లకలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దేవాలయ ఆస్తులు కాపాడాలి: ఆర్డీవో

టెక్కలి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): దేవాలయ ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి స్పష్టం చేశారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'శ్యామసుందర స్వామి ఆలయ ఆస్తులపై కన్ను' శీర్షికతో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన దేవాదాయశాఖ సిబ్బందిని పంపి వివరాలు సేకరించారు. ఇదిలా ఉండగా చదు ను చేసిన ప్రదేశాన్ని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటరమణ అర్చకుడు పద్మనాభ పండాతో కలిసి పరిశీలించారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అర్చకుడిని ఆదేశించారు. ఈ స్థలం లోతుగా ఉండడంతో వర్షపు నీరు చేరి పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయని, స్థానికులు ఈ స్థలంలో చెత్తవేసి డంపింగ్‌యార్డుగా మారుస్తున్నారని, అందువల్ల ఈ స్థలాన్ని చదును చేయడం జరిగిందని అర్చకుడు వివరణ ఇచ్చారు.ఈ స్థలంలో యాగ నిర్వహణ చేయాలనే ఆలోచన ఉందని అర్చకుడు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సైతం ఆరా తీసినట్లు తెలిసింది.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

నరసన్నపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జమ్ము జంక్షన్ వద్ద ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్ జామ్‌ను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'మండుటెండలో గంటపాటు ట్రాఫిక్ జామ్' శీర్షికతో వచ్చిన కథనానికి పోలీసులు స్పందించారు. ఈ సర్వీసు రోడ్డులో పాఠశాలకు వెళ్లే వాహనాలను వ్యతిరేకదిశలో వెళ్లకుండా నిరోధించారు. జమ్ము జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ కింద వాహనాల పార్కింగ్ లేకుండా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనచోదకులకు సూచించారు.

పనితీరు మెరుగుపర్చుకోకుంటే తొలగిస్తాం

- డ్వామా పీడీ సుధాకరరావు



మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

పలాసరూరల్,మార్చి19(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిర్వహణలో ఫీల్డ్ అసిస్టెంట్లు పనితీరు మెరుగుపరచుకోవాలని లేకుంటే విధుల నుంచి తొలగించడం జరుగుతుందని డ్వామా పీడీ బి.సుధాకరరావు హెచ్చరించారు. పలాస ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో జరుగుతున్న పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అలసత్వం వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, గ్రామాల్లో 90 శాతం వేతనదారులకు పనులు కల్పించకుంటే బాధ్యులైన వారిపై చర్యలు తప్పవ న్నారు. కార్యక్రమంలో ఏపీడీలు రాధ, చల్లా శ్రీనివాసరెడ్డి, డీవీవో స్వరూపారాణి, ఏపీవో శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తారా? జీతాలు ఆపేయాలా?

కంచిలి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బాధ్యతగా పనిచేస్తారా లేకుంటే జీతాలు ఆపేయాలా అని డ్వామా పీడీ బి.సుధాకరరావు మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనుల తీరుపై పీడీ అసహనం వ్యక్తం చేశారు. వేతనదారుల సంతకాలు గాని, వేలిముద్రలు గాని లేకుండానే చాలా చోట్ల మస్టర్లు వేయడంపై అధికారులను ప్రశ్నించారు. అక్రమాలకు పాల్పడిన వారి నుంచి రూ.64,446 రికవరీ, 38,500 జరిమానా విధించారు. ఎంపీడీవో తిరుమలరావు, ఏపీవో జి.ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

'మీసేవ'లు పునరుద్ధరణ ప్రకటనపై హర్షం



మంత్రి లోకేష్ చిత్రపటానికి పాలభిషేకం దృశ్యం

కొత్తూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మీ సేవలను పునరుద్ధరిస్తామని మంత్రి నారా లోకేష్ అసెంబ్లీలో ప్రకటించడంపై కొత్తూరు మండల మీసేవా నిర్వాహకుల సంఘం ప్రతి నిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కొత్తూరులో మంత్రి లోకేష్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా ప్రకటన చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మీ సేవా నిర్వాహకుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అల్లు భగవాన్, మునకాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వసపను వీడని ఏనుగులు



వసప పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

కొత్తూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వసప గ్రామ తోటలను ఏనుగులు వీడడం లేదు. గడచిన ఎనిమిది రోజులుగా ఇదేప్రాంతంలో చుట్టుపక్కల తిరుగుతూ ఈ తోటల్లోనే తిష్ఠ వేశాయి. దీంతో ఆ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు ఎటువైపు నుంచి దాడి చేస్తాయోనన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు గాలం కష్టించి పండించిన పంటలు ఏనుగులు ధ్వంసం చేస్తున్నా చూసుకోలేని పరిస్థితి ఎదురైంది. ఏ మేరకునష్టం వాటిల్లిందో కూడా తెలియడం లేదని రైతులు వాపోతున్నారు. ఒకే ప్రాంతంలో ఏనుగులు తిష్ఠ వేయగా వాటిని ఇతర ప్రాంతాలకు తరలించడంలో అధికారులు విఫలమవుతు న్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రేమించి మోసం చేశాడంటూ ఫిర్యాదు

జి.సిగడాం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన కిరణ్ అనే వ్యక్తి ప్రేమించి పెళ్లి చెసుకుంటానని చెప్పి మోసం చేశాడని బుధవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆ యువతి డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్ద ఉండగా.. సిగటాపు కిరణ్ కూడా డిగ్రీ పూర్తి చేసి వ్యవసాయం చేసుకుంటున్నాడు. వీరిద్దరూ 2021 నుంచి ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో కిరణ్ వేరే అమ్మాయిని వివాహం చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న బాధిత యువతి కిరణ్‌ను నిలదీసినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వై.మధుసూదనరావు తెలిపారు.

బాలల రక్షణపై అవగాహన

పలాస, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బాలల రక్షణపై రైలు ప్రయాణికులకు చైల్డ్‌లైన్, రైల్వే పోలీసులు, ఆర్పీఎఫ్, ఐసీడీఎస్ సిబ్బంది బుధవారం అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 ఏళ్ల లోపు బాలబాలికలు ఒంటరిగా కనిపిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. రైలులో గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చే తినుబండారాలు తీసుకోవద్దని సూచించారు. గంజాయి రవాణా చేసినట్లు తెలిస్తే సమాచారం అందించాలని కోరారు.

వంశధార కాలువకు నీటిని విడిచిపెట్టాలి

జలుమూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వంశధార ప్రధాన ఎడమ కాలువకు సాగునీటిని విడిచిపెట్టి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావు కోరారు. జలుమూరులో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. వంశధార ప్రధాన ఎడమ కాలువ కింద వేలాది ఎకరాల్లో రబీ సీజన్‌లో వరి పంటను సాగుచేస్తున్నారని, అయితే గింజకట్టే దశలో నీరు అందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరిపంట తుది దశలో ఉంటే బ్యారేజీలో నీరులేదని వంశధార అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటిని విడిచిపెట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ విషయమై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

మందస కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

హరిపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మందస కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఇదే డిమాండ్‌తో ఈనెల 25న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ సంఘ నాయకులు సవర దర్మారావు, పాల్గునరావు, గురునాథ్ తెలిపారు. ఈ మేరకు మందస సీఐటీయూ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఐటీడీఏ లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీతంపేట ఐటీడీఏకు అనుసంధానంగా మందసలో ఏటీడబ్ల్యూవో కార్యాలయం ఉందని, విశాలమైన బంగ్లా, ఇంజనీరింగ్ కార్యాలయం ఉన్నాయని వీటిని కేంద్రంగా చేసుకొని ఐటీడీఏ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

జీడి, మామిడి పంటల్లో సస్యరక్షణ అవసరం

వజ్రపుకొత్తూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జీడి, మామిడి పంటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ అన్నారు. బుధవారం అమలపాడులో రైతు లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడితోటల్లో ప్రస్తుతం రసం పీల్చే పురుగు సోకిందని దీని నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి సునీత పాల్గొన్నారు.

వంశధార నీటిని ఇచ్ఛాపురం వరకు తరలించాలి

హరిపురం మార్చి19 (ఆంధ్రజ్యోతి): వంశధార నీటిని ఇచ్ఛాపురం వరకు తరలించాలని పలువురు ప్రతినిధులు కోరారు. ఈ మేరకు హరిపురం మార్పు ట్రస్టు కార్యాలయంలో బుధవారం కొర్ల హేమారావుచౌదరి అధ్యక్షతన రైతు సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా మార్పు మన్మథరావు, కార్యదర్శిగా దర్మాపు వెంకటరావులతో పాటు 12 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు బావన పురుషోత్తం, నల్లహడ్డీ, శానపతి ఈశ్వరరావు, ధనుంజయ పాల్గొన్నారు.

కలమటను కలిసిన సిరిపురం

కొత్తూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్లమెంటరీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు బుధవారం మాతలలోని మర్యాదపూర్వకంగా కలిశారు, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను గ్రామ స్థాయిలో ప్రతీ ఒక్కరికి చేరువ అయ్యేలా చూడాలని చర్చించారు.

కాలువ స్థలం కబ్జా



కాలువ స్థలంలో కాంక్రీట్ వేసిన దృశ్యం

నరసన్నపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున మారుతీనగర్ ఒకటో వీధిలో పంచాయతీకి చెందిన కాలువ స్థలం ఆక్రమణకు గురైంది. గత కొన్నాళ్లుగా కాలువకు చెందిన స్థలం పక్కనే దుకాణ నిర్మాణం చేపడుతున్నారు. ఈ కాలువ స్థలంలో రెండు రోజుల కిందట కాంక్రీట్ పనులు చేపట్టారు. దీంతోకాలువస్థలం ఆక్రమణలకు గురైందని, పంచాయతీ అధికారులు స్పందించి దీనిని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. అయితే కాలువ స్థలంలో కాంక్రీట్ పనులు జరుగుతున్నట్లు తెలియదని, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఈవో ద్రాక్షాయిణి తెలిపారు.

న్యూస్ బాక్స్

వెంకన్న ఆదాయం రూ.2.50 లక్షలు

నరసన్నపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గతేడాది అక్టోబరు నుంచి భక్తులు వేసిన ఆదాయం రూ.2.50లక్షలు వచ్చిందని ఈవో, అర్చకులు తెలిపారు.

ఉచిత వైద్య, రక్తదానం శిబిరం

నరసన్నపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్మయి సుగుణం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నరసన్నపేటలో బుధవారం ఉచిత వైద్య, నేత్ర, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. రాగోలు జెమ్స్ ఆసుపత్రి, మోక్ష బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో ఈ శిబిరాలను నిర్వహించారు. 300 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్మయి మిషన్, ఎస్‌వీసీటీ సభ్యులు పాల్గొన్నారు.

మార్కెటింగ్‌తో ఉపాధి అవకాశాలు

నరసన్నపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): యువతకు మార్కెటింగ్ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.లత అన్నారు. బుధవారం కళాశాలలో కోకోకోలా బెవరేజస్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ మార్కెటింగ్ మెలకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఆవు మృతి

టెక్కలి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక టెక్కలి-తెంబూరు రోడ్డు రైల్వే జంక్షన్ పరిధిలో బుధవారం వేకువజామున రైలు ఢీకొని ఆవు మృతిచెందింది. ఆవు రైల్వేట్రాక్ దాటుతుండగా రైల ఢీకొన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఎక్స్‌కవేటర్ సాయంతో ఆవు కళేబరాన్ని తొలగించారు. ఈ ఆవు యజ మాని ఎవరు అన్నది వివరాలు తెలియరాలేదు.

వ్యోమగాముల రాకపై హర్షం

టెక్కలి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): నాసా ప్రయోగించిన అంతరిక్ష వ్యోమగాముల్లో భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, విల్‌మోర్ తదితరులు తొమ్మిది నెలల నిరీక్షణ అనంతరం సురక్షితంగా భూమిపైకి రావడంపై ఐతమ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు హర్షం ప్రకటించారు. బుధవారం కళాశాల గ్రంథాలయం ఆధ్వర్యంలో గ్రంథాలయాధికారి డాక్టర్ సుబ్బారావు, సిబ్బంది వ్యోమగాములకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీని ప్రదర్శించారు. కార్యక్రమంలో షణ్ముఖరావు, మోహన్, వెంకటేష్ పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని వినతి

నందిగాం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పనిభారం తగ్గించాలని గ్రామపంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో టి.రాజారావును కలిసి వినతిపత్రం అందించారు. వివిధ సర్వేల పేరుతో తాము సతమతమవుతున్నామని, పనిభారం తగ్గించి న్యాయం చేయాలని ఆ వినతిలో కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.సంతోష్‌కుమార్, కె.రమణబాబు, వి.లక్ష్మణరావు, గోపీనాథ్, జానకమ్మ పాల్గొన్నారు.

ఘనంగా శివ, పార్వతుల కల్యాణం

టెక్కలి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వేములాడ విశ్వనాథపురంలో విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం శివ, పార్వతుల కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహిం చారు. స్వామి ఉత్సవ మూర్తులకు తిరువీధి చేపట్టారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

22న మండల సమావేశం

కోటబొమ్మాళి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 22న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ రోణంకి ఉమ ఆధ్వర్యంలో జరుగు సమావేశానికి సభ్యులు హాజరుకావాలని కోరారు. వివిధ శాఖల అధికారులు తగు సమాచారంతో రావాలని సూచించారు.